# గంభా సమానురాలు

పట్టభద్రుడై ఆరేళ్లయినా, ప్రతి ఇంటర్వ్యూకి మంచిరోజు చూసుకుని, వీధిలో ముత్తైదువునో కన్యాకుమారినో చూసుకుని బయల్దేరుతున్న నటవరానికి, ఇప్పటికీ ఓ చిరుద్యోగమైనా కలిసిరాలేదు. ఐదో ఇంటంవ్యూలో మరో ఐదువ ఎదురైతే గుమ్మం దిగుదామని వీధి గుమ్మంలో నించున్నాడు. దురదృష్టవశాత్తూ ఏ ఐదువ, ఏ బాలామణి ఎదురవలేదు. ఇంటర్వ్యూకి టైమైపోతోంది. ఇహ గత్యంతరం లేక గుమ్మందిగి చకచకా నడవబోతుండగా. యాభై ఏళ్ల వితంతువు కామమ్మ ఎదురైంది. నటవరానికి గుండెలు దడదడలాడేయి. "మనం సెలక్ట్ కాకపోడం గ్యారంటీ! దీంతో ఏజ్ కూడా బార్ అయిపోతుంది. మనకి గవర్నమెంట్ నౌఖరీ రాసిపెట్టిలేదు. ప్రైవేట్ గుమస్తాగిరీయే అని బ్రహ్మ నానొసట గిరిగీశాడు" అనుకుంటూ నిరాశా నిస్పృహలతో ఇంటర్వ్యూకి బయలు దేరాడు. ఇంతకుముందు మంచిముహూర్తాలు, శకునాలు చూసుకుని బయల్దేరితేనే సెలెక్టు కానిది, దుర్ముహూర్తాలు దుశ్శకునాలు ఎదురైతే సెలెక్టు కావడమా? ఇంపాసిబుల్! అందులోకీ విధవావిడ ఎదురు బడితేనా?

"ఎక్కడి కెళ్తున్నావురా నటవరం?" అడిగాడు బాల్యమిత్రుడు పద్మపాణి.

"అడిగేవూ? ఇహ నా పని అయినట్టే!" గునిశాడు నటవరం.

"నీ పని తప్పకుండా అవుతుంది విజయీ భవ! ఇప్పుడుచెప్పు ఏం పనిమీద వెళ్తున్నావో?" తగుల్కున్నాడు పద్మపాణి.

"ఇహ అవదురా నాయనా! నువ్వెంత దీవించినా అవదు. కర్ణుడి శాపాల్లాగ అనేక దుశ్శకునాలెదుర్కొన్నాను. మొదట గుమ్మం దిగ్గానే గంగా భాగీరథీ సమానురాలు కామమ్మ ఎదురైంది. రెండో దుశ్శకునం నువ్వే ఎక్కడికెళతున్నావని అడిగేవు" అంటూ పద్మపాణిని వేలెట్టి చూపుతూ- "ఇహ నాకు ఇంటర్వ్యూకి టైమైపోతోంది. నన్ను బోరకు" అంటూ జారుకున్నాడు నటవరం.

"ఇంటర్వ్యూ అయ్యేక చెప్తాను. నీబుర్రకి మరమ్మత్ చేస్తాను" అంటూ అరిచాడు పద్మపాణి.

ఎలాగూ ఇంటర్వ్యూలో సెలెక్టవనుకదా అనే మానసిక క్షోభతోను, నిస్పృహతోను ఉండడంవల్ల. ఇంటర్వ్యూయింగ్ ఆఫీసరు అడిగే ప్రశ్నలకి అంతంత మాత్రంగానే సమాధానాలు చెప్పగలిగాడు నటవరం. తను చెప్పిన సమాధానాలన్నీ తప్పులతడకే అని తోచిందతనికి.

ఇంటర్వ్యూ అయి తిరిగొస్తున్నప్పుడు ఓ కిల్లీకొట్టు దగ్గర సిగరెట్‌కాలుస్తూ పద్మపాణి ఎదురుయ్యాడు-

"ఎలా అయిందిరా ఇంటర్వ్యూ నటవరం!"

"నా మొహంలా ఉంది"

"ఇంటర్వ్యూ నీ మొహంలావుందా. నువ్వుచెప్పిన సమాధానాలా?" ఎదురుప్రశ్న వేశాడు పద్మపాణి.

"నేను బయల్దేరినప్పుడు ఎదురైన గంగా భాగీరథి కామమ్మ మొహంలావుంది!" విసుక్కున్నాడు నటవరం.

ఇప్పుడు పద్మపాణి. నటవరం నసాళానికి ఎక్కేటట్టు ఓ స్ట్రాంగా డోసిచ్చాడు.

"చూడు నటవరం! నువ్వు మూడేళ్ల క్రితం ఇంటర్వ్యూకి బయలు దేరినప్పుడు. ఇదేకామమ్మని ఐదువగా పుణ్యస్త్రీగా చూశావు. నువ్వు అనాడే ఇంటర్వ్యూలో సెలెక్టు కావలసింది. ఎందుక్కాలేదు? సరికదా ఆమె తన భర్తని కోల్పోయింది, నువ్వామెను చూసినప్పుడు ఆమె కూడా నీ దౌర్భాగ్యపు మొహాన్నే చూడ్డంవల్ల. భర్తని కోల్పోవలసొచ్చిందేమో? ఆలోచించేవా? మనం ఒక విడోమొహం చూడ్డంవల్ల నష్టం వచ్చిందనుకుంటే, ఆవిడ మన మొహం చూడ్డం వల్ల విడోఅయిందని ఎందుకనుకో కూడదు?" పద్మపాణి తన హేతువాదాన్ని ప్రతిపాదించాడు.

నటవరం ఉక్కిరిబిక్కిరవుతున్నాడు.

పద్మపాణి తన మినీ లెక్చర్ కొనసాగించాడు - " ఇంతకీ మన దేశంలో వితంతువుని గంగాభాగీరథితో సరిపోల్చారు. ఇందాక నువ్వుకూడా గంగాభాగీరథి కామమ్మ ఎదురైందని అన్నావు. గాంగాభాగీరథి వితంతువా? ఆమె భర్త పరమశివుడుకాడా? ఏ పురాణేతిహాసాల్లో గంగాభాగీరథి వితంతువని వర్ణించబడిందో చెప్పునాయనా! చదువుకుంటాను. నీవంటివారి ఈ దురభిప్రాయం మొత్తం స్త్రీజాతికే కళంకం. నీలో ఈ మూఢవిశ్వాస బీజాన్ని నాటిన ఆ మహానుభవులెవరో వాళ్లని ఖండించు!

-నువ్వు ఇంటర్వ్యూలో సెలెక్ట్ కావడం అన్నది. నువ్వు పేర్ చెయ్యడాన్ని బట్టివుంటుంది. మొదటే నువ్వు దుశ్శకునం చూశాననే మెంటల్ డిప్రెషన్‌తో బయల్దేరడం వల్ల ఇంటర్వ్యూలో తప్పుడు జవాబులు చెప్పే అవకాశం ఎక్కువుంది. అంతేకాని శకునాలతో నిమిత్తం లేదు...." పద్మపాణి ఇంకా పూర్తిచేయకుండానే నటవరం మాయమయ్యాడు!

నెల్లాళ్లుపోయేక నటవరం పద్మపాణిని కలిసి. "పద్మపాణీ! నీ హేతువాదానికి జోహార్లు! నాలో తరతరాల నుండీ నరనరాల్లో జీర్ణించుకుపోయిన బూజుని దులిపేశావు. నేను ఇంటర్వ్యూలో సెలెక్టయేను. రేపే డ్యూటీలో జాయినవుతున్నాను!" అని పద్మపాణిని ఆప్యాయంగా కౌగిలించుకుని కృతజ్ఞతలు చెప్పుకోక తప్పలేదు.

⊗⊗⊗

15-9-1977

ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక